22

# అనుబంధాలూ - అవరోధాలూ

ఎంత ప్రయత్నించినా పార్వతికి నిద్రరాలేదు. వెళ్ళి కిటికీ తలుపులు తెరిచింది. ఇంకా సన్నగా వర్షం పడుతోంది. కిటికీ చువ్వలగుండా చల్లటి గాలి వీస్తోంది. మధ్య మధ్య సన్నటి తుంపరకూడా ముఖంమీద పడుతోంది. పార్వతికి అక్కడ నుంచి కదలాలనిపించలేదు. కిటికీలో కూర్చుంది. నిశ్చలంగా ఆకాశం కేసి చూస్తూ ఆలోచిస్తున్నది.

'పార్వతీ!'

గడపలో ముకుందం నిల్చుని పిల్చాడు. గాలి హోరుకు పార్వతికి వినిపించలేదు. ముకుందం దగ్గరకు వచ్చాడు.

'ఈదురుగాలి కొడుతోంది. నీ వంటికి మంచిది కాదు. ఎందుకు కూర్చున్నా విక్కడ? అన్నాడు.

పార్వతి ఉలిక్కిపడ్డది. ముకుందం తదేకంగా ఆశ్చర్యంగా తనవేపు చూస్తున్నాడు. పార్వతి చప్పున కిటికీలోంచి కిందికి దిగింది.

'ఏమిటి అట్లా చూస్తున్నారు నావైపు?' అన్నది.

'ఎందుకో ఇవాళ నువు కొత్తగా కనిపిస్తున్నావు.'

పార్వతి పెదిమల మీద ఓ చిరునవ్వు కలిగింది. 'మామూలుగానే ఉన్నాను. వర్షం చూస్తుంటే మనసుకు ఆహ్లాదంగా ఉంది.' ముకుందానికి తను వచ్చిన పని జ్ఞాపకం వచ్చింది. 'ఈ వర్షాల మూలంగా పని సాగడంలేదని మేస్త్రి ఉత్తరం రాశాడు. నేను రేపు ఉదయమే వెళ్ళి ఏదో తంటాలు

పడితే తప్ప పని గడువులో పూర్తయేట్టులేదు. డాక్టర్‌తో కూడా మాట్లాడాను. రోజూ వస్తుంటాడు. మందులు జాగ్రత్తగా వాడుతూ ఉండు' అన్నాడు ముకుందం.

పార్వతి ముకుందం చెయ్యి తీసుకొని మెల్లగా నొక్కింది. యేదో చెప్పడానికి ఆమె పెదిమలు కదులుతున్నాయి. 'రేపుండి మర్నాడు వెళ్ళండి పని దగ్గరికి' అన్నది ఆఖరుకు. ముకుందానికి ఆశ్చర్యం కలిగింది. పార్వతి ఎప్పుడూ తన్ను ఇట్లా అభ్యర్థించలేదు. ఇంతకన్నా అనారోగ్యంతో ఉన్నప్పుడు కూడా ఆమె తన సాన్నిధ్యాన్ని కోరలేదు. ముకుందం హృదయంలో జాలి కలిగింది. పార్వతిని దగ్గరకు తీసుకున్నాడు.

'ఏమిటి పార్వతీ విశేషం? అన్నాడు. పార్వతికి మాట పెగలలేదు. కనుకొలకుల్లో నీళ్ళు నిలిచాయి. చాలాసేపటికి గొంతు పెగల్చింది.

'రేపు మా నాన్నగారు వస్తున్నారు ఇక్కడికి.' ముకుందానికి ఎక్కడలేని ఆశ్చర్యమూ కలిగింది. పార్వతి తనదైననాడే పుట్టింటికి పరాయిదైపోయింది. వాళ్ళు పార్వతిని పూర్తిగా మరచిపోయారు. ఏనాటికైనా వాళ్ళు మళ్ళీ పార్వతి ఉనికిని గుర్తిస్తారని ముకుందం అనుకోలేదు. పార్వతి నోటంట విన్న విషయం ముకుందానికి నిజంగా చాలా ఆశ్చర్యం కలిగించింది. 'నాన్న గారి దగ్గర్నించి ఉత్తరం వచ్చింది. పార్వతి ఉత్తరం తీసి ముకుందానికి చూపింది. ఉభయ కుశలోపరి, ఆయన వస్తున్న విషయము తప్ప అందులో ఏమీ లేదు. ఇన్నాళ్ళ తర్వాత ఆయన రావటమే గొప్ప విశేషం. ఇందాక పార్వతిలో తను గమనించిన మార్పుకి కారణం ముకుందానికి చప్పున స్ఫురించింది. సంతృప్తిగా ఊపిరి పీల్చాడు.

'సరే మీ నాన్నగారు వచ్చిన తర్వాతే వెళ్తాను' అన్నాడు. పార్వతి కొంగుతో కన్నీళ్లు తుడుచుకుంది. ఆమెలో బాధ, ఆనందమూ ఉవ్వెత్తుగా పొంగిపొర్లాయి. ఇన్నాళ్లూ తన్ను తండ్రి బహిష్కరించినందుకు బాధ – ఇవ్వాళతో ఆ బహిష్కరణకు అంతమొందుతున్నందుకు ఆనందం!

'ఆయన హృదయం గొప్పది. నన్ను క్షమించారు. నన్ను క్షమించారు' అన్నది ఉద్వేగంగా.

ముకుందం ఏమీ మాట్లాడలేదు. వెళ్ళి మంచంమీద కూర్చున్నాడు. పార్వతి ముకుందం మోకాళ్ళకి తల ఆనించి కూర్చున్నది.

చాలాసేపటి వరకు ఎవరూ ఏం మాట్లాడలేదు. ముకుందం చెయ్యివేసి పార్వతి తల నిమురుతున్నాడు. అతని హృదయం ఆర్ద్రమైంది. గుండెపట్లు ఎవరో లాగుతున్నట్లు బాధపడ్డాడు. 'పద పార్వతీ పడుకుందువుగాని' అన్నాడు. పార్వతి మెల్లగా వెళ్ళి పక్కమీద పడుకుంది. పక్కా కుదరలేదు. నిద్రా రాలేదు. ఇన్నాళ్లూ తండ్రి తనపట్ల ప్రవర్తించిన తీరు జ్ఞాపకానికి వస్తోంది. ఆయన ఎంతో కఠినంగా ప్రవర్తించాడు. మమతలూ, మమకారాలూ ఏవీలేక తను ఎంతగానో క్షోభపడిపోయింది. తన బాధలో పాలు పంచుకునేందుకు ఎవ్వరూ లేరు. తను ఏకాకి తనపట్ల ఎవరికీ సానుభూతి లేదు. కన్న తండ్రికే లేనప్పుడు ఎవ్వరి నుంచి ఆశిస్తుంది తను? గతం తవ్వుతుంటే గుండెపట్లు సడలాయి. శోకం ఉప్పెనలా పొంగి పొర్లింది. ఎంత ప్రయత్నించినా గుండెల్లో ఇమడలేదు.

'యేడుస్తున్నావా పార్వతీ.'

ముకుందం మళ్ళీ గదిలోకి వచ్చాడు. పార్వతి చివ్వున లేచి కళ్ళు ఒత్తుకున్నది. పార్వతిని యెట్లా ఓదార్చటమో అతనికి తోచలేదు. స్థాణువులా నిలబడ్డాడు. కాసేపటికి పార్వతి గొంతు పెగిల్చి 'మీరు వెళ్లి పడుకోండి' అన్నది. ఆమె గొంతు గాద్గదికమైంది.

'వెళ్తాను. ఎందుకేడుస్తున్నావు' అన్నాడు ముకుందం. పార్వతిముఖానికి చేతులు కప్పుకుంది. అశ్రువులు ధారకట్టాయి.

'ఛాఛా! పసిపిల్లలా ఏమిటి పార్వతీ'.

'నాన్నకు నా ముఖం ఎలా చూపను?' వెక్కివెక్కి ఏడుస్తోంది. ముకుందం ఏం జవాబు చెప్పగలడు? అన్యాయాలూ, అక్రమాలూ, అవినీతి పనులు చేసేవాళ్లు ఎవరూ బాధపడటంలేదు. దర్పంగా తలెత్తుకు తిరుగుతున్నారు. పార్వతిది మంచిగంధం లాంటి మనసు. క్షంతవ్యంకాని అపరాధం ఏమీ చెయ్యలేదు. ఊరికే క్షోభపడిపోతున్నది. కేవలం ఆమెది మనో దౌర్బల్యం.

'పరువూ ప్రతిష్ట అన్నీ మంటకలిపాను. అయినా నాన్నగారిది జాలిగుండె. పేగులబంధం తెంచుకోలేకపోయారు. అందుకే ఆయన ఇక్కడికి వస్తున్నారు.'

'సరే ఆయన నిన్ను క్షమించినందుకు సంతోషించక ఏడుస్తావెందుకు పార్వతీ' అన్నాడు ముకుందం.

నిజమే. పీడకలలాంటి గతాన్ని తలచుకొని యేడ్వడం దేనికి? చప్పున పార్వతి దుఃఖాన్నించి తేరుకుంది. ముకుందం వెళ్ళి పడుకున్నాడు.

పార్వతి కళ్లు మూసుకున్నది. ఎంత వద్దనుకున్నా ఆమె ఆలోచనలు పునరావృతమౌతున్నవి. తన్ను తండ్రి ఎంతో గారాబంగా పెంచాడు. పెద్ద చేశాడు. తన రాత సరిగా లేక ఏడాది తిరక్కముందే భర్తపోయాడు. తన బాధలో నాన్న భాగం పంచుకున్నాడు. ఆయన గుండెల్లో ఆరని మంటలు రగిలాయి. పచ్చగా కన్నులపండువుగా కనపడవలసిన కూతురు పసుపుకుంకుమలకు దూరమైతే యే తండ్రి సహించగలడు గనక! ఆ రోజుల్లోనే ముకుందం తారసిల్లాడు. అణగారిన ఆశలు మళ్ళీ మోసులెత్తాయి. తన వయసూ, అందమూ అడవికాచిన వెన్నెల కాకూడదు. తన జీవితం మళ్ళీ నందనవనం కావాలి అనుకున్నది. కానీ సంఘర్షణ తప్పలేదు. తనకు రూఢిగా తెలుసు. తన తండ్రి తను మళ్ళీ వివాహం చేసుకునేందుకు అంగీకరించడు. ఆయన దృష్టిలో అది క్షమింపరాని మహాపరాధం. ఈ స్థితిలో ఒక నిశ్చితాభిప్రాయానికి ఒక పట్టాన రాలేకపోయింది తను.

ముకుందం ధైర్యం నూరిపోశాడు. 'వ్యవస్థ మారుతోంది. వ్యవస్థతోబాటూ సాంఘిక నియమాలూ, సంప్రదాయాలూ అన్నీ మారిపోతున్నాయి. పాతవాటిని పట్టుకొని వేలాడితే సుఖపడలేవు పార్వతీ' అన్నాడు.

తనకి సుఖం మీద ఆశవున్నది. ఆ ఆశవల్ల సంప్రదాయాల్ని, సాంఘిక నియమాల్ని ఉల్లంఘించకలదు. కానీ తన తండ్రిగారి మాటేమిటి? తన మూలంగా ఆయన బాధలకి గురికావలసి వస్తుంది. పెళ్ళిళ్ళు కావలసిన చెల్లెండ్రు ఉన్నారు. తన తెగువ వారి భవిష్యత్తు మీద దెబ్బతీయవచ్చు. ఇట్లా ఆలోచించటానికి మొదలుపెడితే సవాలక్ష సమస్యలు ఉత్పన్నమయ్యాయి. వాటన్నింటికి ముకుందం ఒకే జవాబు చెప్పాడు.

'సుఖాన్వేషణలో వెనకముందులు చూడకూడదు. ధైర్యంగా ముందడుగు వేయాలి. కష్టనష్టాలు బేరీజు వేసుకుంటూ కూర్చుంటే కూర్చున్న చోటునే ఉంటాం' అన్నాడు.

ముకుందం ప్రోత్సాహం చూచిన తర్వాత తను సాహసం చేయడమే మేలనిపించింది. ఎవరి జీవితం వారిది. దాన్ని ఒకరికోసం త్యాగం చేయవలసిన అగత్యం ఎక్కడుంది? అన్ని సంకోచాలూ విడిచి ముకుందాన్ని మళ్ళీ పెళ్ళి చేసుకుంది.

పెళ్ళిలో అనుకున్నట్టుగానే తన తండ్రి కలవలేదు. అయితే తనకి ఆశ చావలేదు. ఈ రోజు కాకపోతే ఇంకోరోజు తండ్రి తన్ను చేరదీస్తాడు. ఆయనది దయార్ద్ర హృదయం. అనుబంధాన్ని అంత సులభంగా తెంచుకోలేడు – అనుకుంటూనే యేడేళ్లు ఎదురు తెన్నులు చూచింది. అమితమైన క్షోభని అనుభవించింది. ఇన్నాళ్ళకి మళ్ళీ తను తండ్రికి జ్ఞాపకం వచ్చింది. ఇట్లా ఆలోచిస్తూ ఆమె ఏ ఒంటిగంటకో నిద్రపోయింది.

మరుసటి రోజు పార్వతి తండ్రి వెంకట్రామయ్యగారు రానే వచ్చారు. పార్వతి ఇంటి విషయాలు ఎన్నో అడిగి తెలుసుకోవాలనుకుంది. చివరకి ఏమీ అడగలేకపోయింది. 'ఇంట్లో అంతా బాగున్నారా నాన్నా' అని మట్టుకు అడిగింది. వెంకట్రామయ్యగారు కూతురు ఆరోగ్యం గురించి పరామర్శించారు. 'చాలా చిక్కిపోయావమ్మా' అన్నారు. తర్వాత మాట్లాడుకునేందుకు తండ్రీ కూతుళ్ల మధ్య మాటలు కరువయ్యాయి.

మధ్యాహ్నం భోంచేసి వెంకట్రామయ్యగారు విశ్రాంతి తీసుకుంటున్నారు. పార్వతి ముకుందం దగ్గరకు వెళ్ళి 'నాన్న వెంట ఊరికి వెళ్ళి నాలుగు రోజులుండి వస్తాను' అన్నది. ముకుందం తలెత్తి 'ఆయన రమ్మంటున్నాడా?' అన్నాడు. ఈ ప్రశ్న ఆమెను కొంచెం ఇరుకున పెట్టింది. మమతను చంపుకోలేక ఇన్నేళ్ళ తర్వాత తండ్రి మళ్ళీ తనింటికి వచ్చాడు. మనసులో తనమీద యేమాత్రం కోపమున్నా ఆయన ఈ ఇంటి గడప తొక్కేవారు కాదు. ఆయనకు మనసులో ఏమీలేదు. తప్పకుండా ఆయన పిలుస్తారు.

'ఆడవాళ్ళకి పుట్టింటి మీదున్న ఆపేక్ష ఆయనకు తెలుసు. తప్పక తీసుకెళతారు' అన్నది.

ముకుందం సన్నగా నవ్వాడు. 'వెళ్ళు పార్వతీ. గాలి మార్పుకి నీ ఆరోగ్యం కూడా మెరుగవవచ్చు' అన్నాడు.

పార్వతికి ముఖం వికసించింది. ఇల్లూ, పరిసరాలూ, పొలాలూ అన్నీ కళ్ళముందు నిలిచాయి. తనకు యే అనారోగ్యమూ లేదు. ఇంటిమీద బెంగ తప్ప. ఒక్కసారి అక్కడికి వెళ్తే మళ్ళీ తనలో కొత్త రక్తం ప్రవేశిస్తుంది. తను మామూలు మనిషి అవుతుంది. పార్వతి తృప్తిగా ఊపిరి పీల్చింది. మూడింటికి వెంకట్రామయ్యగారు లేవగానే పార్వతి కాఫీ ఫలహారం అందించింది. వెంకట్రామయ్యగారు కాఫీ ముగించి 'ముకుందం ఎక్కడమ్మా?' అన్నాడు. 'ఆయన గదిలో యేవో రాసుకుంటున్నారు నాన్నా' అన్నది.

వెంకట్రామయ్యగారు లేచి ముకుందం గదిలోకి వచ్చారు. పార్వతి గడపలో కూర్చుంది. బహుశా నాన్న తన్ను పంపమని అడుగుతాడనుకున్నది. వెంకట్రామయ్యగారు కాసేపుండి, 'సుశీలకి

పెళ్ళి నిశ్చయమైంది ముకుందం' అన్నాడు. సుశీల పార్వతికన్నా చిన్నది. దాని పెళ్ళి ఖాయమైందన్నమాట వినగానే పార్వతికి అపరిమితానందం కలిగింది. ఎప్పుడో దానిపెళ్ళి కావలసింది. తన మూలంగా ఇన్నాళ్లు జరిగింది. పార్వతి కళ్ళల్లో ఆనందబాష్పాలు నిలిచాయి. ముకుందం సంతోషం ప్రకటించాడు. వెంకట్రామయ్య గారు వరుని స్థితిగతుల్ని గూర్చి చెప్పారు. అన్ని విధాలా మంచి సంబంధం.

చిట్టచివరికి వెంకట్రామయ్య విషయం బయటపెట్టాడు. 'పదివేలు కట్నం ముట్టచెబుతామన్నంత వరకూ వాళ్ళు సుశీలని చేసుకోడానికి ఇష్టపడలేదు. ఇంటి పరిస్థితులు మీకు తెలియనివేమీ కావు. ఏదో విధంగా నన్ను గడ్డనవేయాలి ముకుందం' అన్నాడు. ఆయన ప్రాధేయపూర్వకంగా.

ముకుందం నోరెత్తలేదు. పదివేలకి చెక్కురాసి అందించాడు. తండ్రి చెక్కు జేబులో పెట్టుకుంటూండగా చూచి పార్వతి కళ్ళల్లో సంతృప్తి నాట్యం చేసింది. కాసేపు గదిలో నిశ్శబ్దం ఆవరించింది. ఉన్నట్టుండి వెంకట్రామయ్య 'వస్తాను ముకుందం. నేను ఈ బండికే ఊరువెళ్ళాలి. ముహూర్తం చాలా దగ్గర్లోవుంది. చెయ్యాల్సిన పనులు చాలావున్నాయి. వస్తానమ్మా పార్వతీ' అన్నాడు. ఆ తర్వాత ఆయన వాళ్ళ సమాధానం ఆశించకుండానే సంచి తీసుకున్నాడు. అటు పార్వతికానీ ఇటు ముకుందానికి కానీ నోటమాట పెగల్లేదు. ముకుందం ఆయన వెంట వీధివరకు వెళ్ళాడు. మామా అల్లుళ్ళు వెళ్తుండగా శిలా ప్రతిమకుమల్లే పార్వతి కాసేపు అట్లాగే చూస్తూ నిలబడ్డది. తండ్రి కనుమరుగుకాగానే గుండు దెబ్బతిన్న ఆడపులిలా రివ్వున గదిలోకి వెళ్ళి దభీమని తలుపులు వేసుకుంది. గదిలో ఆవిడ చేసిన ఆక్రందనకు గది గోడలు ప్రతిధ్వనించాయి.

కథా నిలయం
5181

**- (1968, విశాలాంధ్ర)**